ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

● పకడ్బందీగా ఏర్పాట్లు
● పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ



పీలేరు: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మదనపల్లె ఉప విద్యాశాఖ డివిజన్ పరిధిలో 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి రోజు 9693 మంది విద్యార్థులకు పరీక్షలు రాయాల్సి ఉండగా 9410 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద సూపరింటెండెంట్‌లు, ఛీప్ సూపర్‌వైజర్లు, కస్టోడియన్లు పర్యవేక్షించారు. దీంతో పాటు స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందుగానే చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సందడిగా కన్పించాయి. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థుల హాల్‌టిక్కెట్లును పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోని అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు లోపలికి అనుమతించలేదు. విద్యార్థుల కోసం తాగునీరు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద ఆరోగ్య కార్యకర్తలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఆర్డీవో ఎం.ఎస్.మురళి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

రామసముద్రం: మండలంలో సోమవారం జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 253 మంది విద్యార్థులు , దిన్నిపల్లె సమీపంలోని మోడల్ స్కూల్‌లో 245 మంది పరీక్షలు రాయగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో హేమలత తెలిపారు.

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్(తెలుగు) పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ రాజగోపాల్ తనిఖీ చేశారు. మొదటిరోజు తెలుగు పరీక్షకు 336 మంది విద్యార్థులకు గాను 332 మంది హాజరైనట్లు తెలిపారు.

పీలేరు రూరల్ : మండలంలో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈవో బాలాజీ నాయక్ తెలిపారు. పీలేరు పట్టణంలోని 9 పరీక్షా కేంద్రాలలో 1527 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండాలని 1514 మంది హాజరైనట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు చెప్పారు.

వాల్మీకిపురం: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 563 మంది విద్యార్థులకు గానూ 4 విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారని ఎంఈఓ వెంకటరత్నం తెలిపారు.

కలికిరి: మండలంలో మహల్(తెలుగు) ఉన్నత పాఠశాల, కలికిరి పట్టణ పరిధిలోని బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 568 మంది విద్యార్థులకు గాను మహల్ కేంద్రంలో ఐదుగురు, కలికిరి బాలికోన్నత పాఠశాల కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈఓ రంగనాథరెడ్డి తెలిపారు.

కలకడ : మండలంలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి.
మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మునీంద్ర నాయక్ తెలిపారు.

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్, కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. సోమవారం జరిగిన మొదటి రోజు పరీక్షకు 455 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో రెడ్డిబాషా వివరించారు.

బి.కొత్తకోట: పదవ తరగతి పరీక్షలను స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఐదు కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 874 మంది విద్యార్థులు పరీక్షకుగాను 856 మంది హాజరయ్యారు.

ములకలచెరువు: మండల వ్యాప్తంగా మూడు కేంద్రాల్లో 764 మంది విద్యార్థులకు గాను 757 మంది హాజరయ్యారని ఎంఈఓ వెంకటరమణ తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీవైఈఓ క్రిష్టప్ప, సీఐ సాదిక్ అలీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటరమణ తనిఖీ చేశారు.

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో మొదటిరోజు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ త్యాగరాజు తెలిపారు. స్థానిక మోడల్‌స్కూల్ పరీక్ష కేంద్రంలో 161 మందికి గాను 159 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 143 మంది పరీక్ష రాశారు.






మదనపల్లె సిటీ: హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం, పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు , సూచనలిస్తున్న ఆర్డీవో ఎం.ఎస్.మురళి , బురకాయలకోట పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ములకలచెరువు: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ములకలచెరువు ఎస్ఈబీ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 15 ద్విచక్రవాహనాలు, కార్లకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు రూ.1000 చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సీఐ తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కలికిరి: ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఎంఈఓ రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు 1వ తరగతిలో ప్రవేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ లోపు ఆసక్తి కలిగిన పిల్లల తల్లిదండ్రులు సీఎస్సీ లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఎంపికకు ఈ నెల 13న మొదటి విడత, 29న రెండవ విడత లాటరీ నిర్వహించనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44లక్షల లోపు ఆదాయం కలిగిన వారు అర్హులని, పాఠశాలలో చేరిన విద్యార్థులు పట్టణ ప్రాంతం వారికి రూ.8వేలు, గ్రామీణ ప్రాతం వారికి రూ.6500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలోని మదనపల్లె, వాల్మీకిపురం, తంబళ్లపల్లె మండలాలకు సంబంధించి మంగళవారం సబ్ కలెక్టర్ ఆఫీసులో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్‌లు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ సుజాత తెలిపారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వారి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కాల్ లెటర్స్ అందజేశామన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

రక్షణభేరి కరపత్రాల ఆవిష్కరణ

బి.కొత్తకోట: ఈనెల 8న మదనపల్లెలో నిర్వహిస్తున్న రాజ్యాంగ రక్షణభేరి కరపత్రాలను స్థానిక వీకేసీ పార్టీ కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు హజరై జయప్రదం చేయాలని కోరారు.తమిళనాడు, కర్ణాటకకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు హజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సచిన్, సింగన్న, మాధవ, వెంకటేష్, గంగాద్రి, ఆంజనేయులు, నరేంద్ర, అరవింద్, ఉదయ్, తరుణ్, మహేష్ పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి, తుమ్మరకుంట, సంపతికోట, మడుమూరులో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి సోమవారం ఎంపీడీవో గిరిధర్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం: స్థానిక బస్టాండ్‌లో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పాదచారులు, ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ మహమూద్, వైస్ ఎంపీపీ శోభా, మహిళా మండలాధ్యక్షురాలు ధనలక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, సర్పంచ్‌లు తమక శంకర్, గిరీష్, ఎంపీటీసీ చంద్రశేఖర్ తెలిపారు.

గృహ సారథులకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మడుమూరు, రంగసముద్రం గ్రామ సచివాలయ పరిధుల్లోని గృహ సారథులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ, సచివాలయ కన్వీనర్లకు మండల కన్వీనర్ డ్రిప్ రమణ 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సర్పంచ్‌లు నాగరత్నం నాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, రామాంజులు, ఎంపీటీసీలు సుజాత, పద్మావతమ్మ తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం

కురబలకోట: కురబలకోటలోని శ్రీ కోదండ రామస్వాముల వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కల్యాణోత్సవం, అదే రోజు రాత్రి గరుడోత్సవం, 5న రథోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త కెబి లక్ష్మణ రావు, ఈఓ టి. మంజుల తెలిపారు. ఈసారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి యువకులు సంకల్పించారు.

అర్జీలను పరిష్కరించాలి

గుర్రంకొండ: స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఖజాబీ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందనలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావ్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సైనిక్ భవనాన్ని అప్పగించాలి



మాట్లాడుతున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు

మదనపల్లె : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సైనిక్‌భవన్(గృహస ముదాయాన్ని)ను తక్షణం మాజీ సైనికులకు అప్పగించాలని మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సైనిక్ భవన్‌ను మాజీ సైనికులకు అప్పగించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 02/09/2022లో మాజీ సైనికుల సంఘానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశాలను అందజేసి కోర్టు తీర్పును గౌరవించాల్సిందిగా పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1982లో సర్వేనెంబర్ 298/2లో 3 సెంట్లు, 298/3లో 3 సెంట్లు మొత్తం 6 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్‌ధర ప్రకారం మాజీ సైనికులు కొనుగోలు చేసి గృహ సముదాయాన్ని నిర్మించుకోవడం జరిగిందన్నారు. 1993లో రెవెన్యూ అధికారులు గృహ సముదాయాన్ని దుకాణాలుగా మార్చారనే సాకుచూపి స్వాధీనం చేసుకున్నారన్నారు. నాటి నుంచి నేటి వరకు సుమారు 30 ఏళ్లుగా రెవెన్యూ అధికారులు షాపురూముల నుంచి అద్దెలు వసూలు చేసుకుంటున్నారన్నారు. దీనిపై మాజీ సైనికులు హైకోర్టును ఆశ్రయిస్తే సైనికులు ప్రభుత్వం నుంచి మార్కెట్‌ధరకు కొనుగోలు చేసినందున సైనిక్‌భవన్ మాజీ సైనికులకే చెందుతుందని తీర్పు వచ్చిందన్నారు. దేశం కోసం కుటుంబానికి దూరంగా ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి దేశసేవ చేసినందుకు మాజీ సైనికులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇలాగేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వారంరోజుల్లోపు న్యాయం జరగకపోతే సబ్ కలెక్టరేట్ ఎదుట మాజీ సైనికులు ఆమరణ నిరాహారదీక్షకు దిగుతామని తెలిపారు. సమావేశంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ నాగరాజ, బీమారెడ్డి, చంద్రశేఖర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు వినతుల వెల్లువ



స్పందనలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్ కలెక్టరేట్, మున్సిపాలిటీలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. సబ్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన స్పందనలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన బి.మల్లికార్జున తన భార్య హేమలతను మార్చి 15న తమ గ్రామానికి చెందిన సాంబ మత్తుమందు ఇచ్చి రాత్రి 9 గంటల ప్రాంతంలో బొలేరో వాహనంలో తీసుకెళ్లాడన్నారు. ఈ విషయమై 19న నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశామని, ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి విచారణ చేయలేదన్నారు. నాలుగేళ్ల కుమారుడు తల్లి కోసం అమ్మకావాలని బెంగపెట్టుకున్నాడని, పోలీసులు గ్రామంలోని సాంబ తల్లిదండ్రులను విచారిస్తే తన భార్య ఆచూకీ దొరుకుతుందని, తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. సీటీఎంలో ఆర్‌ఓబీ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు జరిపిన సర్వేలో గంగమ్మగుడికి సంబంధించిన 4 సెంట్ల స్థలంను మార్కింగ్ చేశారని, దేవాలయ అభివృద్ధిలో భాగంగా స్థలాన్ని విడిచిపెట్టి సర్వే నిర్వహించాలని అభివృద్ధి కమిటీ సభ్యులు ఆనంద్ పార్థసారథి వినతిపత్రం సమర్పించారు. పీటీఎం మండలం బండమీదపల్లె పంచాయతీ తురకపల్లె గ్రామానికి చెందిన సాకిరా తన భర్త గత ఏడాది మార్చి 21న మరణించారని, ఆయనకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పటివరకు మంజూరు కాలేదన్నారు. ఆయన కంటే వెనుక మరణించిన వారికి బీమా డబ్బులు అందాయని, సచివాలయంలో అడిగితే బ్యాంకు అధికారుల మీద చెప్పి తప్పించుకుంటున్నారు. న్యాయం చేయాలని వేడుకుంది. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో కృష్ణానగర్‌లో కుక్కలతో చాలా ఇబ్బందిగా ఉందని చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీలకు ఫిర్యాదు చేశారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు



తరిగొండలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించిన అధికారులు

గుర్రంకొండ: చిరుధాన్యాలతో శరీరానికి మంచి పోషకవిలువలు లభిస్తాయని తరిగొండ ప్రభుత్వ వైద్యాధికారి రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. సోమవారం మండలంలోని తరిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా వెల్‌బేబీ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్యవంతమైన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో తీసుకోవడం వలన మంచి శక్తితో పాటు పోషక విలువలు లభిస్తాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం పోషణ పక్వాడ్ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవం

కలకడ : మండలంలోని ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో పేరు నమోదు చేసుకుని నెలవారి పరీక్షలు చేసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరితే సురక్షిత ప్రసవంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంపీ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవులపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను అందించి గర్భిణులు, బాలింతలకు చికిత్స చేశారు. అలాగే 56 మందికి సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల నిర్మాణ పనులు త్వరలో పూర్తి

– ఎస్ఈ ఎన్.కృష్ణారెడ్డి



ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

పీలేరు రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వాస్పత్రుల నిర్మాణ పనులు జూన్ ఆఖరు లోపు పూర్తి చేస్తామని కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఎస్ఈ ఎన్. కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పీలేరు వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వంద కోట్లతో నాలుగు ఏరియా ఆస్పత్రులు పీలేరు, శ్రీకాళహస్తి, నగిరి, పలమనేరులో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు చెప్పారు. అలాగే రెండో విడతలో గంగాధరం నెల్లూరులో రూ. 26 కోట్లతో కార్వేటి నగరం, పెనుమూరులో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు ప్రారంభం అయినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు కొరవడకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పీలేరు ఏరియా ఆస్పత్రి పనులు చురుగ్గా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మే నుంచి దశల వారీగా ఆస్పత్రుల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ధనుంజయరెడ్డి, డీఈ కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయ లక్ష్యాన్ని అధిగమించాలి



ఆర్ఎం రామును సత్కరిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ రోజువారీ ఆదాయ లక్ష్యాన్ని అధిగమించడానికి అధికారులు, కార్మికులు కృషి చేయాలని ఆర్ఎం రాము అన్నారు. సోమవారం పీలేరు డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో 513 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. నెలకు 49.66 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నట్లు చెప్పారు. నెలకు రూ. 23.34 కోట్లు ఆదాయం లక్ష్యం కాగా ప్రస్తుతం రూ. 18.97 కోట్లు ఆదాయం వస్తోందని తెలిపారు. జిల్లాలో కారుణ్య నియామకాలకు 35 దరఖాస్తులు అందగా 15 మందికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు వివరించారు. మదనపల్లె-1 డిపో పరిధిలో కొత్తగా పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఎం కుమార్, ఏడీసీ కేకే. నాయుడు, యల్లయ్య, నాయకులు సుబ్రమణ్యంరాజు, ప్రమీల పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కలికిరి: మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న ఆర్వో ప్లాంట్‌కు సోమవారం ఎంపీడీఓ గంగయ్య స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులందరికీ అనుకూలంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే మొర్రకింద పల్లి పంచాయతీ అలకంవారిపల్లి వద్ద రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, నాయకులు బావాజీ, రఘు, రామలింగేశ్వరయ్య, మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు సుందరీకరణకు రూ. 2 కోట్లు

–పరిశీలించిన ఏపీజీబీసీ బృందం



చెరువును పరిశీలిస్తున్న బృందం

బి.కొత్తకోట: బి.కొత్తకోట పెద్దచెరువు సుందరీకరణకు అమృత్–2.0 కింద రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్టు ఏపీజీబీ కార్పొరేషన్‌కు చెందిన పర్యావరణ శాస్త్రవేత్త సర్వేష్, అర్బన్ డిజైనర్ శ్రేయేష్ రవి చంద్రన్ చెప్పారు. మంజూరైన నిధుల వినియోగానికి సంబంధించిన పనులపై సోమవారం వీరు పెద్దచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులోకి నగరపంచాయతీ నుంచి మురికినీరు చెరువులోకి చేరి కాలుష్యమైందన్నారు. ఈ నీటిని మళ్లించడం, నీటి శుద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చెరువుకట్టపై పార్కు ఏర్పాటు, వాకింగ్ కోసం ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. డ్రైనేజీ కాలువ డైవర్షన్ పనులు చేపడతామన్నారు. పెద్దచెరువు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. బృందానికి అవసరమైన వివరాలను మేనేజర్ రమాదేవి, సిబ్బంది బృందానికి తెలియజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పీలేరు : మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డికి విన్నవించారు. సోమవారం ఎస్టీకాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 30 కుటుంబాలుపైగా జీవనం సాగిస్తుండగా గ్రామంలో దీర్ఘకాలంగా నీటి సమస్య నెలకొందని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. స్పందించిన ఎంపీడీఓ నీటి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కంటి సంరక్షణపై ప్రత్యేక చొరవ చూపాలి

పీలేరు : కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక చొరవ చూపాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని తలపుల గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 18 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించినట్లు తెలిపారు. మిగిలిన వారికి కంటి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. తలపుల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయంలో దశల వారీగా వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

వాల్మీకిపురం: దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు యామల సుదర్శనం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం స్థానిక జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. రెండు రోజుల క్రితం పట్టాభిరాముడి తిరునాల సందర్భంలో విఠలంకు చెందిన కొంత మంది వ్యక్తులు వాల్మీకిపురంకు చెందిన మర్రిపాడు అంజప్ప, ఇతని కుమారుడు హరిలపై కత్తులతో పొడిచి గాయపరచడంతో పాటు కులం పేరుతో దూషించడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడికి కారణమైన వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఎస్ఐ బిందుమాధవి సంఘటనా స్థలానికి చేరుకొని నిందితులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు వీరభద్రయ్య, శివయ్య, సుధాకర్, రఘు, చంద్రయ్య, మనోహర్, మోహన్, మాణిక్యం, దనయ్య, నరేష్, సునీల్, భాస్కర్, కిషోర్, సుబ్రమణ్యం, కిరణ్ కుమార్, నాని, రామాంజులు, యల్లప్ప, హరి, అశోక్ కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించండి

మదనపల్లె సిటీ: ప్రయాణికులు ఆర్టీసీ ఆదరించాలని ఆర్టీసీ డిపో -1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం డిపో కార్యాలయంలో బి.కొత్తకోట, తంబళ్లపల్లె మార్గంలో మార్చి లక్కీ డిప్‌ను చౌడసముద్రం సర్పంచు జయచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ రాజారెడ్డిలు డ్రా తీశారు. డీఎం మాట్లాడుతూ ప్రయాణికుల కోసం ఆర్టీసీ మరిన్ని సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. బి.కొత్తకోట మార్గంలో నారాయణమూర్తి, శ్రీనివాసరెడ్డి, లావణ్య, తంబళ్లపల్లె మార్గంలో శంకర్, రమణ, సురేంద్రలకు బహుమతులు అందజేశారు. అనివార్య కారణాల వల్ల హాజరుకాని వారు డిపో కార్యాలయంకు వచ్చి తీసుకుపోవాలని డీఎం తెలిపారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో స్వయంగా తయారు చేసిన పలు రకాల పోషకాలు నిండిన వంటలను ప్రదర్శించారు. ఇటువంటి పోషకాలు నిండిన వంటలను బాలింతలు, గర్భిణులు తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. అనంతరం హెల్త్ బేబీ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, బాలింతలు, చిన్నారులు ఉన్నారు.

బిందుసేద్యంతో బహుళ ప్రయోజనాలు

పీలేరు : బిందు సేద్యంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్. పాండురంగ అన్నారు. సోమవారం మండలంలోని వేపులబైలు పంచాయతీలో కేవీకే ఆధ్వర్యంలో రైతులకు సూక్ష్మ నీటి పారుదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు సేద్యంతో నీరు ఆదా అవడం తోపాటు పంటకు సామూలంగా నీరు, ఎరువులు అందించవచ్చునని తెలిపారు. అలాగే డ్రిప్ వినియోగంలో వచ్చే సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి జ్ఞాన శేఖర్, ఆర్‌బీకే ఇన్‌చార్జి మాధురి, రైతులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక బస్టాండ్‌లో సోమవారం వాల్మీకి సంఘంనాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానించడంపై హర్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. మండలంలోని వాల్మీకులు వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆటిజం లక్షణాలుంటే శిక్షణ ఇవ్వాలి

మదనపల్లె సిటీ: రెండు సంవత్సరాల పిల్లలకు ఆటిజం లక్షణాలు ఉంటే గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం వెలుగు పాఠశాలలో వరల్డ్ ఆటిజం స్పెక్ట్రమ్ డిసోడెర్ పై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటిజం అనేది జబ్బుకాదని, అది మానసిక వైకల్యం అంతకన్నా కాదని, కేవలం మెదడులో చిన్న రసాయన మార్పు వాళ్ల కలిగే రుగ్మతన్నారు. రకరకాల రుగ్మతలతో బాధపడుతున్న పిల్లల అందరికి వెలుగు ప్రత్యేక పాఠశాలలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మేనరికం వాళ్ల ఇలాంటి పిల్లలు పుడతారని, మగ శిశువుల్లో ఈ ఆటిజం శాతం ఎక్కువగా ఉన్నారన్నారు. ముందుగానే ఆటిజం గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.